



అప్పటివరకు పీఠగుమ్మంలో కూర్చుని ఎదురు చూసిన కామేశ్వరి, విసుగుదలతో లేచి యింట్లోకి వెళ్ళి మంచంమీద నడుంవాల్చింది. సైరను కేక చాలా ఘోరంగా వినిపిస్తూంది. అంటే అప్పుడే ఎనిమిది గంటలయిందన్నమాట. ఇంకా ఆమె భర్త లక్ష్మీనారాయణ బజారునుంచి రాలేదు. ప్రతిదినం ఆలస్యంగా రావడం అలవాటయిపోయింది అతను వచ్చి భోజనం చేస్తేనే గాని తాను భోజనం చెయ్యదు. అయితే కామేశ్వరికి మాత్రం చాలా జోరుగా ఆకలి వేస్తూంది. కాని భర్త రానిదే ఎలాగ తినడం? ఆలోచిస్తూ ఉంటే చిన్న కునుకుపట్టింది.

పార్కుదగ్గర సైరను కేక విన్నతరువాత బయల్దేరాడు లక్ష్మీనారాయణ. ఇంటికి పార్కుకి రమారమి మైలున్నర దూరం ఉంటుంది. సిగరెట్టు కాల్చుకుంటూ మెల్లగా వస్తూఉంటే దారిలో సుబ్బారావు పార్కుకి తగిలాడు. వాణ్ణి వదిలించుకొని వచ్చేసరికి, తొమ్మిదిన్నర అయిపోయింది. ఇంటికొచ్చి తలుపు తట్టేడు. కామేశ్వరి చాలా విసుగ్గా తలుపు తీసింది.

అయిపాయా తిరగడాలు? ఇంట్లో ఆడది ఒక్కర్తీ ఉంటుంది అనే జ్ఞానే మీకు లేదు కదా. పోనీ రేపట్నుంచైనా వేగిరం రద్దురూ, ఆకలివేస్తున్నా మీకోసం కనిపెట్టుకొని కూర్చున్నాను' అని బాధంతా వెళ్ళగక్కింది.

'రేపట్నుంచి నాకోసం నువ్వు కనిపెట్టుకొని ఉండనక్కర్లేదు. తింటూ ఉండు' అన్నాడు. ఆ మాటలు విని దెబ్బతిన్న లేడిలాగ లక్ష్మీనారాయణవైపు చూసింది కామేశ్వరి. లక్ష్మీనారాయణ వచ్చి విస్తరిముందు కూర్చున్నాడు. కామేశ్వరి యిద్దరికీ వడ్డన చేసింది. 'అంతేకాని వేగిరం వస్తాను అని మీ నోటంట రాదు కదూ' అనింది కామేశ్వరి, చిన్న పిల్లాణ్ణి పరీక్షిస్తున్న తల్లిలాగ. లక్ష్మీనారాయణ మాట్లాడకుండానే తన భోజనం పూర్తిచేశాడు. కామేశ్వరి కూడా అతనితో తొందరగా భోజనం చేసింది. లక్ష్మీనారాయణ బట్టలు వేసుకున్నాడు. కామేశ్వరికి యీ ప్రయాణం ఎక్కడికో అర్థంకాలేదు.

'ఇంత రాత్రప్పుడు ఎక్కడికి వెళ్తారండీ' అన్నది ఆదోలాగ చూస్తూ.

'సినిమాకి' రిస్టువాచీ పెట్టుకుంటూ అన్నాడు.

'ఆ సినిమా సంగతులు నాకు బాగా తెల్సు' అనుకున్నది కామేశ్వరి మనస్సులో.

'నేనూ వస్తాను.'

'ఇవాళ యింకా మొదటరోజు. చాలాజనం ఉంటారు. వారంరోజులు పోయిన తర్వాత వెళ్దాం' అన్నాడు.

'అయితే యిప్పుడు ఎవరెవరు వెళ్తారు?'

'నేనూ, ఒక స్నేహితుడు.'

---

"మూర్తిశ్రీ"

---

కామేశ్వరికి ఆ రెండో వ్యక్తి పుంలింగము కాదనీ, తన భర్త దాస్తున్నాడని అర్థంఅయింది.

లక్ష్మీనారాయణ వెళిపోయాడు. కామేశ్వరి వెళ్ళి యింట్లోకి పోయి మంచంమీద నడుం వాల్చింది.

ఈమధ్యనే కామేశ్వరికి ఒక చిన్న వింతయిన ఆలోచన మనస్సులో కలిగింది. ఎలాగో లాగున కష్టపడి, తన మేధాశక్తి నంతటినీ ఉపయోగించి ఒక విషయం రిసెర్చి చేసి కనుక్కుంది. అదేమిటంటే యిటీవల తన భర్త పర స్త్రీలోలుడయిపోయాడని. అందుకు ప్రబలమైన కారణం లేకపోలేదు కూడ. యింతకుపూర్వం సాయంత్రం ఆరుగంటలకే తిరిగొచ్చే తన భర్త తొమ్మిది గంటలకు కాని రాకపోవడం, వారానికి రెండుసార్లయినా సినీమా నెపం పెట్టుకొని రాత్రి సమయాలలో యిల్లు దాటుతూ ఉండటం, యీ విషయాలు ఆమె ఊహని బలపర్చాయి.

* * *

లక్ష్మీనారాయణ బి ఏ ప్యాసయిన తరువాత నాలుగైదు సంవత్సరాలు తింటూ తిరుగుతూ గడిపేశాడు. అతని తండ్రి కాలేజీలో ప్రధానోపాధ్యాయుడు కనుక తను ఉద్యోగం చెయ్యనికే యింట్లో గడువదనే బెంగ పోయింది. కాని లక్ష్మీనారాయణ తండ్రికి మాత్రం తన కుమారుడు ఊరికనే, తిని తిరగటం యిసుమంతైనా యిష్టం లేదు. అందు చేత ఎలాగోలాగున లక్ష్మీనారాయణని ఒప్పించి, బి యి. డి. ట్రైనింగుకి పంపేడు పట్టా పుచ్చుకున్న తరువాత ప్రతిరోజూ, వాంటెడ్ కాలమ్స్ చూడటం ఒకపని అయిపోయింది. సూర్యనారాయణ ప్రోత్సాహంమీద, ఒక అమ్మాయిల బడిలో సైన్సు మేష్టరు గిరికి అప్లికేషను దాఖలు చేసుకున్నాడు. ఉద్యోగం అయేసరికి వివాహం అయి అప్పటికే రెండు సంవత్సరాలయింది. భార్యను తీసుకుపోయి కాపురం పెట్టుకున్నాడు.

ఇదే మొదటి సారి పాఠం చెప్పడం. స్కూల్ ఫైనల్ క్లాసు. అందరూ ఆడ పిల్లలు. లక్ష్మీనారాయణకి ఒకరకమైన భయం, జంకు కలిగింది. 'వెళ్ళిపోయిన మాష్టారు ఎంతవరకు చెప్పారు?' అన్నాడు ఉత్తరీయం సవరించుకుంటూ.

'ఉదజని చెప్పాలి' అని ఒకరు, 'అమ్లజనిలో కొంతభాగం వాదిలేశారు' అని ఒకరు యిలాగున రమారమి యిరవై గొంతుకలు వినిపించాయి.

'అలాగున అందరూ ఒక్కసారి మాట్లాడ రాదు. ఎవరో ఒక్కరే మాట్లాడాలి' అన్నాడు.

సరళ బాల నిలబడి 'గరిమనాభి-భూమ్యాకర్షణశక్తి చెప్పాలి' అన్నది.

లజ్జా భారంచేత లక్ష్మీనారాయణకి మాటలు కాస్త తడబడ్డాయి.

నాలుగురోజులు పోయినతర్వాత సాఫీగానే నడవసాగింది క్లాసు.

ఒకనాడు లక్ష్మీనారాయణ, తన అధికారిణికూడ తనవీధే రావడం కనిపెట్టాడు.

'మీరు యీవీధివైపు వస్తున్నారేం?'

'నాలుగురోజుల క్రిందటనే మీ వెనుక వీధిలో దిగాం.'

'మీవారికి ఏంపని?' చనువుగా అడిగాడు.

'పనిలేదు. ఏవోకథలు వ్రాసుకుంటారు.'

'పేరు?'

'మణిభూషణరావు'

'ఆఁ... మీరు బ్రాహ్మణులు. పైగా నా ఆప్తమిత్రుని భార్యా మణి...'

'మీరూ, మా ఆయన చాలా స్నేహితులా?'

'కావండీ... వస్తాను.'

'ఎప్పుడైనా... రండి.'

'అలాగే. వీలు చూసుకొని వస్తాను' అన్నాడు లక్ష్మీనారాయణ. ఆ సందుదగ్గర యిరువురూ విడిపోయారు.

ఆతర్వాత లక్ష్మీనారాయణ రెండు మూడు సార్లు స్నేహితుని యింటికి వెళ్ళడం, తన అధికారిణి రెండు మూడుసార్లు తమయింటికి రావడం జరిగింది. యిలాంటి చిన్న చిన్న విషయాలు, కామేశ్వరికి చాలా అనుమానాన్ని కలిగించాయి. రాత్రి సమయాల్లో, లక్ష్మీనారాయణ వెళ్ళేదికూడా, స్నేహితుల యింటికే.

* * *

కామేశ్వరి ఆలోచించింది. యీయన యిలాంటి దురవాట్లకు లోనయిపోయారే అని. అదీకాక, తనకన్నా ఏమంత అందంగా ఉన్నది ఆ సుజాత? తనకన్నా కాస్త తెల్లతోలు తొడిగింది. చెప్పలేం. తనకిమాత్రం ఆ

మణిభూషణరావుపైన ఎన్నిసార్లుమనసుపోలేదు. నిజానికి మణిభూషణరావు యీయన కన్నా బాగుంటాడు కూడాను. యిది తను ఎన్నిరోజుల నుండో అనుకుంటూంది. ఆ రోజు తమ యింటికి వచ్చినప్పుడు తను కాఫీ పట్టుకొని వెళ్ళియిస్తే తనని త్రాగేస్తున్నట్టు చూశాడు. తనకి అదోలాగ అనిపించింది. యీరోజు ఎలాగయినా యీ విషయం గురించి పరిశోధన గావించాలి. పైగా మణిభూషణరావు యీరోజు ఊరికి వెళ్ళాడు. ఇలాంటి అదును చూసే యీయన బయల్దేరారు అనుకొని లేచి తలదువ్వుకొని, బయలుదేరింది. గుమ్మం దిగేసరికి, వీధిలో మణిభూషణ రావు ఎదురయ్యాడు. కామేశ్వరి చాలా ధైర్యంగా ప్రశ్నించింది. 'ఏమండీ ఎక్కడికి?' 'మా యింటికే' అన్నాడు.

కామేశ్వరికి గాభరా ప్రవేశించింది. యితను యింటికి వెళ్ళినట్టయితే, తన భర్తని చావచంపుతాడు. యింక తనభర్త తనకు దక్కడు. తన పరువంతా పోతుంది. అందరూ హేయంగా చెప్పుకుంటారు అందుకు ఎలాగయినా యితన్ని యిక్కడే ఉంచెయ్యాలి అనుకని ఆలోచించింది.

'యింకా రాండి'... అని పిలిచింది.

'నేనా! ఎందుకూ?' ఆశ్చర్యపోయాడు మణిభూషణరావు.

'కాస్త మాట్లాడాలి'

'నాతోనా'

'అవును'

మణిభూషణరావు వెళ్ళాడు లోపలికి. 'ఇలా కూర్చోండి' మంచం చూపించింది. చాలా భయపడుతూ మణిభూషణరావు కూర్చున్నాడు. కామేశ్వరి పక్కనే ఒక కుర్చీలో కూర్చుంది.

'మీ కథలు చదివేను. చాలా బాగుంటాయి'

'......... .....'

'మీ కథలు చాలా సహజంగా ఉంటాయి'

'రేపెప్పుడైనా మాట్లాడుకుందాం. పొద్దుపోయింది నేను వెళ్ళొస్తా.'

'మీకు చాలా విషయాలు చెప్పాలి, కొంచెం ఉండండి.'

'రేపువస్తాను. మీ భర్తకూడా ఉంటాడు. యింకా నాల్గుగంటలుపోతే కాని రాడు'



'ఆ సంగతి మీకెలాగ తెలుసు?'

'ఇందాక, నేను అతణ్ణి సినిమా దగ్గర చూశాను, టిక్కట్టుకొంటూ ఉంటే. నన్నూ రమ్మన్నాడు. కానీ నేను రానని చెప్పాను. రైలు తప్పిపోయాను. అందుకు యింటికి వెళ్ళిపోతున్నాను.'

'మా ఆయన సినిమాకి వెళ్ళారా? రోజూ మీరు యీ వేళకి యింటిదగ్గరే ఉంటారా?'

'ఆ... ఉంటాను — నేను, లక్ష్మీనారాయణ, సుజాత, రోజూ కిన్నాపాటి మాట్లాడుకుంటాం రాత్రి పన్నెండు వరకూ. రోజూ భోజనం చేసి మా యింటికి వస్తారు ఇవాళ నేను ఊళ్ళో ఉండనని సినిమాకి వెళ్ళాడు —...'

కామేశ్వరి గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి దెయ్యాలూ, భూతాలు ఆమెని బాధిస్తున్నట్టయింది.

'వెళ్ళండి... వేగిరం వెళ్ళండి... రేపు రావద్దు. అసలు నాతో మాట్లాడకండి...'

మణిభూషణరావుకి ఏమీ అర్థం కాలేదు.

'కామేశ్వరీ ..'

'వెళ్ళండి ...' కసిరింది. భూషణరావు వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత కూడా లక్ష్మీనారాయణ స్నేహితుల యింటికి వెళ్ళడం మానలేదు.'